ఎల్ఐసీ చేతికి మణిపాల్‌సిగ్నా!

50 శాతం వాటా కొనుగోలుకు ఆసక్తి
ఇరు వర్గాల మధ్య కొనసాగుతున్న చర్చలు
హెల్త్ ఇన్సూరెన్స్‌లోకి ఎంట్రీ దిశగా అడుగులు

న్యూఢిల్లీ, నవంబర్ 28: దేశీయ అతిపెద్ద బీమా సంస్థ, ప్రభుత్వ రంగ జీవిత బీమా కంపెనీ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ).. ఆరోగ్య బీమాలోకి ప్రవేశించే అంశంలో స్పీడ్ పెంచింది. ఇందులో భాగంగానే మణిపాల్‌సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్‌లో 50 శాతందాకా వాటాను కొనేందుకు గట్టిగా చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. హెల్త్ ఇన్సూరెన్స్ వ్యాపారంలోకి వెళ్దామని ఎల్ఐసీ ఎప్పట్నుంచో యోచిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కొత్తగా ఓ సంస్థను పెట్టి దానిద్వారా ఈ సెగ్మెంట్‌లో ముందుకెళ్లడం కంటే ఇప్పటికే ఉన్న సంస్థలో వాటాను సొంతం చేసుకొని వెళ్లడమే లాభదాయకం అని ఎల్ఐసీ భావిస్తున్నట్టు తెలుస్తున్నది. అందుకే మణిపాల్‌సిగ్నాలో వాటాల కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నట్టు చెప్తున్నారు. ఈ నెల 8న ఎల్ఐసీ త్రైమాసిక ఆర్థిక ఫలితాల ప్రకటన సందర్భంగా కంపెనీ ఎండీ, సీఈవో సిద్ధార్థ మహంతి కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది మార్చి ఆఖర్లోగా ఇప్పటికే ఆరోగ్య బీమా సేవల్ని అందిస్తున్న కంపెనీలో వాటాను కొంటామని, తద్వారా ఈ విభాగంలోకి వస్తామని ఆయన చెప్పారు. అయితే ఏ సంస్థలో వాటాను కొంటామన్న వివరాల్ని మాత్రం తెలియపర్చలేదు.

ఇండో-అమెరికన్ జాయింట్ వెంచర్

మణిపాల్‌సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్ అనేది ఓ ఇండో-అమెరికన్ జాయింట్ వెంచర్. బెంగళూరు ఆధారిత మణిపాల్ ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ గ్రూప్, అమెరికాకు చెందిన సిగ్నా కార్పొరేషన్ కలిసి ఏర్పాటు చేశాయి. ఇందులో మణిపాల్ గ్రూప్‌నకు 51 శాతం వాటా ఉన్నది. మిగతా 49 శాతం వాటా సిగ్నాది. అయితే ఈ డీల్ కుదిరితే ఎల్ఐసీకి దామాషా ప్రకారం అటు మణిపాల్ గ్రూప్, ఇటు సిగ్నా రెండూ కలిసి తమ వాటాల నుంచి 50 శాతం వాటాను అమ్మవచ్చని సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తున్నది. మణిపాల్‌సిగ్నా స్టాక్ మార్కెట్లలో నమోదు కాలేదు. ఇది కూడా ఇందులోనే ఎల్ఐసీ వాటా కొనేందుకు దోహదం చేస్తున్నది. స్టార్ హెల్త్ అండ్ అల్లీడ్ ఇన్సూరెన్స్, నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్‌లు స్టాక్ మార్కెట్లలో నమోదయ్యాయి. దీంతో వాటి మార్కెట్ విలువ వరుసగా రూ.13,740 కోట్లు, రూ.26,843 కోట్లుగా ఉన్నాయి. వీటితో పోల్చితే మణిపాల్‌సిగ్నానే ఎల్ఐసీకి చౌకగా లభిస్తున్నది.

డీల్ విలువ రూ.2వేల కోట్లు?

మణిపాల్‌సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్‌తో ఎల్ఐసీ చర్చలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నట్టు ఓ ప్రముఖ జాతీయ మీడియా సంస్థ వార్తల్నిబట్టి తెలుస్తున్నది. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2023-24) మణిపాల్‌సిగ్నా ప్రీమియం వసూళ్లు స్థూలంగా రూ.1,691 కోట్లుగా ఉన్నాయి. అలాగే కంపెనీ విలువను రూ.3,500-4,000 కోట్లుగా అంచనా వేస్తున్నారు. దీంతో డీల్ కుదిరితే 50 శాతం వాటాకు ఎల్ఐసీ రూ.1,750-2,000 కోట్లు చెల్లించాల్సి రావచ్చు. హెల్త్ ఇన్సూరెన్స్‌కు నానాటికీ పెరుగుతున్న ఆదరణ దృష్ట్యానే ఎల్ఐసీ ఈ వ్యాపారంలోకి రావాలని నిర్ణయించుకున్నది. ప్రస్తుతం రూ.3 లక్షల కోట్ల జనరల్ ఇన్సూరెన్స్ ఇండస్ట్రీలో 37 శాతం వాటా హెల్త్ ఇన్సూరెన్స్‌దే.

బ్యాంక్ అస్యూరెన్స్‌కు లిమిట్

బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్‌డీఏఐ.. బ్యాంక్ అస్యూరెన్స్ బిజినెస్‌కు పరిమితుల్ని పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీమా సంస్థకు, బ్యాంకుకు మధ్య కుదిరే భాగస్వామ్య ఒప్పందాన్నే బ్యాంక్ అస్యూరెన్స్ అంటారు. ఇందులో బ్యాంక్ కస్టమర్లకు ఇన్సూరెన్స్ కంపెనీలు తమ పాలసీలను బ్యాంకుల ద్వారానే అమ్ముతూంటాయి. అయితే పాలసీలను అమ్మే విషయంలో బ్యాంకులపై బీమా సంస్థలు అధికంగా ఆధారపడటం మంచిది కాదని, దీని వల్ల సదరు బ్యాంకులు ఆర్థిక ఇబ్బందుల్లో పడితే పాలసీదారులూ నష్టపోతారని ఐఆర్‌డీఏఐ ఆందోళన వ్యక్తం చేస్తున్నది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సైతం రిస్క్‌తో కూడిన విధానాల ద్వారా బీమా పాలసీలను అమ్మడం ఆపాల్సిన అవసరం ఉందని ఇటీవల అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే ఐఆర్‌డీఏఐ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నది. ఇన్సూరెన్స్ కంపెనీలు తమ మొత్తం వ్యాపారంలో బ్యాంకుల ద్వారా జరుగుతున్న వ్యాపారాన్ని 50 శాతానికి తగ్గించుకోవాలని ఐఆర్‌డీఏఐ కోరినట్టు ఓ ప్రముఖ జాతీయ మీడియా సంస్థ నివేదిక చెప్తున్నది. వచ్చే కొద్దినెలల్లో ఈ వ్యవహారంపై ఐఆర్‌డీఏఐ ఓ తుది నిర్ణయం తీసుకోవచ్చని కూడా అంటున్నారు. ప్రస్తుతం ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లో 90 శాతం వ్యాపారం ఎస్బీఐ ద్వారానే జరుగుతున్నది. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్‌లో 85 శాతం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ద్వారానే వస్తున్నది. మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ మొత్తం వ్యాపారంలో యాక్సిస్ బ్యాంక్‌తో అందుకుంటున్నదే 90 శాతం. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ వ్యాపారంలో ఐసీఐసీఐ బ్యాంక్ వాటా దాదాపు 50 శాతంగా ఉన్నది. మరోవైపు ఐఆర్‌డీఏఐ ఆలోచనతో గురువారం స్టాక్ మార్కెట్లలో ఆయా ఇన్సూరెన్స్ సంస్థల షేర్లు పడిపోయాయి. మ్యాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎస్బీఐ లైఫ్ షేర్ల విలువ 3.29-5.41 శాతం మేర నష్టపోయాయి.

చిలుకానగర్‌లో బీవోబీ శాఖ

ఉప్పల్, నవంబర్ 28: ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) ఉప్పల్‌లోని చిలుకానగర్‌లో గురువారం నూతన శాఖను ప్రారంభించింది. బీవోబీ జనరల్ మేనేజర్, హైదరాబాద్ జోనల్ హెడ్ రితేశ్ కుమార్ చేతులమీదుగా ఇది మొదలైంది. బ్యాంక్ కస్టమర్లకు ఇక్కడ అన్నిరకాల సేవలు అందుబాటులో ఉంటాయని, రుణాలపై వడ్డీ రేటు తక్కువేనని చెప్పారు. కాలనీవాసులు బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా, హైదరాబాద్ జోన్‌లో ఇది 430వ శాఖ. నార్త్ రీజియన్‌లో 61వ బ్రాంచ్ అని డీజీఎం సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ నార్త్ రీజియన్ హెడ్ సీవీఎస్ చంద్రశేఖర్, బిజినెస్ డెవలప్‌మెంట్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎంవీఎస్ సుధాకర్, బ్రాంచ్ అధిపతి ఎం సందీప్ పాటిల్ పాల్గొన్నారు.

ఆడీ క్యూ7 ఎస్‌యూవీ

ప్రారంభ ధర రూ.88.66 లక్షలు

న్యూఢిల్లీ, నవంబర్ 28: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడీ ఇండియా.. దేశీయ మార్కెట్లోకి తన ఫ్లాగ్‌షిప్ ఎస్‌యూవీ క్యూ7 సరికొత్త వెర్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారు రూ.88.66 లక్షలు మొదలుకొని రూ.97.81 లక్షల గరిష్ఠ స్థాయిలో లభించనున్నది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. 3.0 లీటర్ల వీ6 టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో తయారైన ఈ మాడల్‌లో 8-స్పీడ్ గేర్‌బాక్స్, కేవలం 5.6 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 250 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఈ సందర్భంగా ఆడీ ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ మాట్లాడుతూ..వచ్చే ఏడాది లగ్జరీ కార్ల ఇండస్ట్రీ 8-10 శాతం వృద్ధిని నమోదు చేసుకోనుండగా, సంస్థ కూడా ఇంతే స్థాయిలో వృద్ధిని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది జనవరి-సెప్టెంబర్ మధ్యకాలంలో ఇండస్ట్రీ 5 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా, ఈ ఏడాది 50 వేల యూనిట్లకు చేరుకుంటున్నదన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తంచేశారు.

200 కోట్లతో బన్యన్ నేషన్ విస్తరణ

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ పరిశ్రమను నిర్వహిస్తున్న అంకుర సంస్థ 'బన్యన్ నేషన్' రూ.200 కోట్ల పెట్టుబడితో హైదరాబాద్‌లో మరో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. గురువారం సంస్థ ప్రతినిధులు సచివాలయంలో మంత్రిని కలుసుకొని భవిష్యత్తు పెట్టుబడి ప్రణాళికను వివరించారు. ప్రస్తుతం హైదరాబాద్‌కు సమీపంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో 15 వేల టన్నుల వార్షిక సామర్థ్యంతో 'బన్యన్ నేషన్' రీసైక్లింగ్ పరిశ్రమను నిర్వహిస్తున్నది. ఈ ప్లాంట్ సామర్థ్యాన్ని 45 వేల టన్నులకు విస్తరించడానికి నూతన ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిందన్నారు. ఈ విస్తరణ పూర్తయితే మరో 500 మందికి కొత్తగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని మంత్రి వెల్లడించారు. రీసైక్లింగ్ చేసిన ప్లాస్టిక్‌ను ఈ సంస్థ యూనీలివర్, టాటా మోటార్స్ లాంటి పెద్ద కంపెనీలకు విక్రయిస్తుందని మంత్రి తెలిపారు. రూ.100 కోట్ల వార్షిక టర్నోవర్ కలిగిన బన్యన్ నేషన్ లాభాల్లో నడుస్తున్నదని, కొత్త ప్లాంట్ ఏర్పాటు కోసం వారు మరి కొంత భూమిని అడుగుతున్నారని, దీనిపై టీజీఐఐసీ నిర్ణయం తీసుకుంటుందని మంత్రి వివరించారు.

Banyan Nation

కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

ఒక్కరోజే 1190 పాయింట్లు పడిపోయిన సెన్సెక్స్ • 24 వేల కిందకు నిఫ్టీ

ముంబై, నవంబర్ 28: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీగా నష్టపోయాయి. బ్లూచిప్ సంస్థల షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి గురికావడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలే ప్రధాన కారణం. అక్టోబర్ నెలకుగాను అమెరికాలో రిటైల్ ద్రవ్యోల్బణం 2.3 శాతానికి పెరగడం.. రాబోయే ద్రవ్యసమీక్షల్లో ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోతలకున్న అవకాశాలకు గండికొట్టింది. ఇక భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు సైతం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఈ క్రమంలోనే మదుపరులు లాభాల స్వీకరణకు పెద్దపీట వేశారు. పెట్టుబడుల ఉపసంహరణకు దిగారు. ఫలితంగా ఐటీ, వాహన, కన్జ్యూమర్ డ్యూరబుల్ రంగ షేర్లు పతనమయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 1,300 పాయింట్లకుపైగా దిగజారి 79 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 1,190.34 పాయింట్లు లేదా 1.48 శాతం నష్టపోయి 79,043.74 వద్ద ముగిసింది. నిఫ్టీ 360.75 పాయింట్లు లేదా 1.49 శాతం క్షీణించి 23,914.15 వద్ద స్థిరపడింది.

లక్షన్నర కోట్ల సంపద ఆవిరి

గత రెండు రోజులుగా భారీ లాభాలతో కళకళలాడిన మదుపరులకు గట్టి షాక్‌తగిలింది. గురువారం ఒకేరోజు మదుపరులు రూ.1.50 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. ఇరు సూచీలు ఒక్క శాతానికి పైగా నష్టపోవడంతో బీఎస్ఈలో లిస్టైన సంస్థల మార్కెట్ క్యాపిటల్ విలువ రూ.1,50,265.63 కోట్లు కరిగిపోయి రూ.4,42,98,083.42 కోట్లు(5.24 ట్రిలియన్ డాలర్లు)కి జారుకున్నది. అమెరికా మార్కెట్లలో భారీగా అమ్మకాలు జరగడంతో ఇప్పట్లో వడ్డీరేట్లు తగ్గే అవకాశాలు లేకపోవడం, అంతర్జాతీయ దేశాల్లో అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతుండటం మదుపరుల్లో ఆందోళన పెంచిందని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. ఐటీ రంగ సూచీ అత్యధికంగా 2.35 శాతం నష్టపోయింది.

నిఫ్టీలో భారీగా నష్టపోయిన షేర్లు

%		POINTS
-5.41	SBI Life	1,424.00
-3.74	HDFC Life	655.10
-3.35	M&M	2,904.00
-3.34	Infosys	1,860.30
-2.53	Adani Ports	1,169.55
-2.49	HCL Tech	1,844.00
-2.48	Bajaj Finance	6,539.00
-2.38	Tech Mahindra	1,715.00
-2.03	Titan	3,224.80
-1.93	Hero Motocorp	4,777.00

Reliance digital
PERSONALISING TECHNOLOGY

రిలయన్స్ డిజిటల్‌లో బ్లాక్ ఫ్రైడే సేల్స్

ముంబై, నవంబర్ 28: పండుగ సీజన్ పూర్తికావడంతో కస్టమర్లను ఆకట్టుకోవడానికి రిలయన్స్ డిజిటల్ సరికొత్తగా బ్లాక్ ఫ్రైడే విక్రయాలు ఆరంభించింది. ఈ ఆఫర్లలో భాగంగా ఎంపిక చేసిన డెబిట్, క్రెడిట్ కార్డులు(ఐసీఐసీఐ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, వన్‌కార్డ్) కొనుగోళ్లపై రూ.10 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్‌తోపాటు కన్జ్యూమర్ డ్యూరబుల్‌పై రూ. 22,500 వరకు క్యాష్‌బ్యాక్ ఇస్తున్నది. ఈ ప్రత్యేక ఆఫర్ డిసెంబర్ 2 వరకు అందుబాటులో ఉండనున్నది.

3,300 కోట్ల సెటిల్‌మెంట్

తెలుగు రాష్ర్టాల క్లెయింలపై స్టార్‌హెల్త్ ప్రకటన

హైదరాబాద్, నవంబర్ 28: గడిచిన ఐదేండ్లలో తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లలో రూ.3,330 కోట్ల విలువైన క్లెయింలను సెటిల్‌మెంట్ చేసినట్లు స్టార్‌హెల్త్ ఇన్సూరెన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సనత్ కుమార్ తెలిపారు. అదే దేశవ్యాప్తంగా నిమిషానికి నాలుగు చొప్పున 1.1 కోట్ల క్లెయింలను సెటిల్ చేసినట్లు, వీటి విలువ రూ.52 వేల కోట్లని ఆయన చెప్పారు. మరోవైపు, ఆరోగ్య పాలసీలపై విధిస్తున్న జీఎస్టీని ఎత్తివేయాలని దీంతో సామాన్యులకు తక్కువకే పాలసీలు లభిస్తాయన్నారు. మరోవైపు, ఇంటివద్దనే హెల్త్‌కేర్ సేవలనూ ప్రారంభించామని, తెలంగాణలో హైదరాబాద్, సికింద్రాబాద్, ఏపీలో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, కాకినాడ, తిరుపతి, నెల్లూరులలో అందుబాటులో ఉంటాయన్నారు.

28వ సారి ఢిల్లీకి సీఎం

సీడబ్ల్యూసీ సమావేశాల్లో పాల్గొననున్న రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు మళ్లీ ఢిల్లీకి వెళ్లనున్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇది ఆయనకు 28వ ఢిల్లీ పర్యటన కావడం గమనార్హం. శుక్రవారం జరిగే సీడబ్ల్యూసీ సమావేశాల్లో సీఎంతోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి దామోదర రాజనర్సింహ, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి పాల్గొంటారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. జార్ఖండ్ పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం భట్టి గురువారమే ఢిల్లీకి వెళ్లారు. ఈ సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాలు, తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొనాల్సిందిగా సోనియా, రాహుల్, ప్రియాంకతోపాటు ఇతర నేతలను ఆహ్వానించనున్నట్టు సమాచారం. మంత్రివర్గ విస్తరణపైనా చర్చించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ఢిల్లీ పర్యటన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటన చేపట్టనున్నట్టు ప్రభుత్వవర్గాలు తెలిపాయి. 30న మహబూబ్‌నగర్‌లో జరిగే రైతు సదస్సులో పాల్గొననున్నారు. డిసెంబర్ 4న పెద్దపల్లి, 7న నల్లగొండ జిల్లాలకు వెళ్లనున్నారు.

నీటి పారుదలశాఖలో ఎక్స్‌టెన్షన్లు వద్దు

హైదరాబాద్, నవంబర్28 (నమస్తే తెలంగాణ): నీటి పారుదలశాఖలో ఎక్స్‌టెన్షన్లను కొనసాగించవద్దని ఇంజినీర్ల సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రభుత్వానికి పలు సంఘాలు గురువారం ప్రకటనలో విజ్ఞప్తి చేశాయి. అయితే ఇరిగేషన్‌శాఖలో ఇప్పటికే పలువురు ఇంజినీర్లకు ఎక్స్‌టెన్షన్లను ఇచ్చారని, దానిని మళ్లీ పునరావృతం చేయవద్దని, అది ముఖ్యమంత్రి హామీలకు వ్యతిరేకమని వెల్లడించారు. హైదరాబాద్ ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడు ఏఎస్ఎన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చక్రధర్, తెలంగాణ ఇరిగేషన్ గ్రాడ్యుయేషన్ ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడు ఎన్ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి గోపాల్‌కృష్ణ, తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఇరిగేషన్ డిప్లొమా ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సంయుక్తంగా ప్రకటనను విడుదల చేశారు.

'తెలంగాణ తల్లి' రూపురేఖలపై గప్‌చుప్!

- **గుట్టుగా డిజైన్లు సిద్ధం చేసిన ప్రభుత్వం**
- **అందరి సూచనలు తీసుకోకుండానే తయారీ**
- **స్పష్టత ఇవ్వాల్సిందేనంటున్న రాష్ట్ర ప్రజలు**

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మారుస్తాం. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా, తెలంగాణ ప్రజల మనసుల్లో ఉన్న రూపాన్ని తీసుకొస్తాం. ఇందుకోసం రాష్ట్రంలోని అన్నివర్గాల అభిప్రాయాలు తీసుకొని, ప్రజాభీష్టం మేరకు మార్పులు చేస్తాం' ఇది ఫిబ్రవరి 4న క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ప్రభుత్వం చేసిన ప్రకటన. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటికే విగ్రహాన్ని కూడా సిద్ధం చేశారని విశ్వసనీయ వర్గాల సమాచారం. మరో వారంరోజుల్లో సచివాలయానికి తరలిస్తారని చెప్తున్నారు. ఇక్కడే అసలు విషయం దాగున్నది. తెలంగాణ తల్లి విగ్రహం ఎలా ఉంటుందన్న విషయం ప్రజల్లో పెద్ద ప్రశ్నగా మారింది. అన్నివర్గాల ప్రజల అభిప్రాయం తీసుకుంటామని చెప్పిన ప్రభుత్వం.. ఎందుకు గుట్టుగా డిజైన్లు సిద్ధం చేయించిందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఏ వర్గం ప్రజలతో సంప్రదించారు?

తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలు నిర్ణయించేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో క్యాబినెట్ సబ్ కమిటీని నియమించారు. ఇందులో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖ ఉన్నారు. ఈ కమిటీ సమావేశాలపై ఒకటిరెండు సార్లు మాత్రమే అధికారిక ప్రకటనలు వచ్చాయి. ఆయా సమావేశాల్లోనూ తెలంగాణ లోగో, రాష్ట్ర గీతంపైనే ఎక్కువగా చర్చ జరిగింది. తెలంగాణ తల్లి విగ్రహంపై చర్చ జరిగినట్టు నామమాత్రంగా కూడా సమాచారం ఇవ్వలేదు. ఇప్పుడు ఏకంగా విగ్రహమే తయారైంది. ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలతో సంప్రదింపులు ఎప్పుడు జరిపిందని, సలహాలు, సూచనలు తీసుకొని మార్పులు, చేర్పులు ఎప్పుడు చేసిందనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానాలు ఇవ్వాల్సి ఉన్నది. ఎవరెవరిని సంప్రదించారు? ఆయా వర్గాల ప్రతినిధులుగా ఎవరు హాజరయ్యారు? అన్న విషయాలను వెల్లడించాలని పలువురు కోరుతున్నారు.

ఎవరి మనసులోని రూపం?

గతంలో బీఆర్ఎస్ రూపొందించిన విగ్రహంపై ఆరోపణలు గుప్పించిన కాంగ్రెస్.. ఇపుడు ఎవరినీ సంప్రదించకుండా ఎందుకు తుదిరూపు ఇచ్చిందని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రజల మనసుల్లో ఉన్న రూపాన్ని తీసుకొస్తామని చెప్పి.. ఎవరి మనసుల్లో ఉన్న రూపాన్ని తీసుకొచ్చారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విగ్రహం ఏర్పాటు చేసిన తర్వాత ఏవైనా లోపాలు ఉన్నా ఏం లాభమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా తెలంగాణ విగ్రహం రూపురేఖలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు.

ఎన్నికల్లో విజయం సాధించిన బీఆర్టీయూ, సీఐటీయూ నాయకుల సంబురాలు

బీడీఎల్‌లో బీఆర్టీయూ, సీఐటీయూ ఘనవిజయం

ఐఎన్‌టీయూసీపై 116 ఓట్ల తేడాతో గెలుపు

హైదరాబాద్,నవంబర్ 28 (నమస్తేతెలంగాణ): భారత్ డైనమిక్ లిమిటెడ్ (బీడీఎల్) హైదరాబాద్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఆర్టీయూ, సీఐటీయూ కూటమి ఘనవిజయం సాధించింది. సమీప ప్రత్యర్థి ఐఎన్‌టీయూసీపై 116 ఓట్లతో జయకేతనం ఎగురవేసింది. గురువారం జరిగిన పోలింగ్‌లో మొత్తం 1550 ఓట్లకు గానూ 1512 ఓట్లు పోలయ్యాయి. ఇందులో బీఆర్టీయూ (బీఆర్ఎస్ అనుబంధ), సీఐటీయూ కూటమికి 788 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అనుబంధ సంఘమైన ఐఎన్‌టీయూసీకి 672 ఓట్లు దక్కాయి. బీజేపీ అనుబంధ సంఘం బీఎంఎస్‌కు కేవలం 70 ఓట్లు పోలవగా, రెండు ఓట్లు చెల్లలేదని అధికారులు ప్రకటించారు. కూటమి విజయంతో బీఆర్టీయూ, సీఐటీయూ నాయకులు సంబురాలు జరుపుకొన్నారు.

భూముల పెండింగ్ దరఖాస్తులకు పరిష్కారం

- **మరో సర్క్యులర్ జారీచేసిన సీసీఎల్ఏ**
- **ఆర్డీవో, అదనపు కలెక్టర్లకు అధికారాలు**
- **మార్గదర్శకాలు జారీచేసిన ప్రభుత్వం**

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): 'పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కరించండి' అంటూ సీసీఎల్ఏ నుంచి కలెక్టర్లకు మరోసారి ఆదేశాలు జారీఅయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 11 నెలలుగా ఇలాంటి ఆదేశాలు తరచూ జారీ కావడం రివాజుగా మారింది. గత మార్చిలో పెండింగ్ దరఖాస్తులకు ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. ధరణిలో పెండింగ్ దరఖాస్తులు రెండు లక్షల వరకు ఉన్నాయని, వాటిని 9 రోజుల్లో పరిష్కరిస్తామంటూ ఊదరగొట్టింది. లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధికోసం మరో రెండు వారాల పాటు హడావుడి చేసింది. ఆ తర్వాత ప్రక్రియను పక్కన పడేసింది. దీంతో ఎన్నికల సమయంలో మరో లక్ష దరఖాస్తులు వచ్చాయని, పెండింగ్ దరఖాస్తుల సంఖ్య 3.10 లక్షలకు పెరిగిందని రెవెన్యూ వర్గాలు తెలిపాయి. విమర్శలు వెల్లువెత్తడంతో మళ్లీ ఈ ఆదేశాలు జారీ అయ్యాయి.

విజయోత్సవాలకు
'స్థానిక ఎన్నికల' ఎర!

- **సంక్రాంతి తర్వాత నోటిఫికేషన్!**
- **అనుకూల మీడియాకు లీకులు?**
- **విజయోత్సవాలు గట్టెక్కించేందుకేనని టాక్**
- **కొలిక్కిరాని బీసీ డెడికేటెడ్ కమిషన్ పని**
- **నివేదిక లేకుండా రిజర్వేషన్ల ఎలా?**
- **బీసీ కోటాకు ఎసరు పెట్టే యోచన?**

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికల అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ప్రభుత్వం జనవరిలో ఎన్నికలు నిర్వహిస్తుందని ప్రచారం జోరందుకున్నది. జూన్‌లో ఎన్నికలు నిర్వహిస్తామంటూ గతంలో ప్రభుత్వం హడావుడి చేసింది. కానీ అదంతా ఉత్త ప్రచారమే అని తేలింది. జనవరిలో కూడా ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బీసీ డెడికేటెడ్ కమిషన్ పని పూర్తి కాకుండా, నివేదిక రాకుండా ఎన్నికల నిర్వహణ అసాధ్యమని కొందరు అంటున్నారు. కమిషన్ నివేదికతో సంబంధం లేకుండా ఎన్నికలకు వెళ్లడమంటే బీసీ రిజర్వేషన్లకు సర్కారు తిలోదకాలు ఇచ్చినట్టేనని చెప్తున్నారు. స్థానిక ఎన్నికల పేరుతో ఆశ చూపించి, క్యాడర్‌ను విజయోత్సవాల్లో భాగస్వాములు చేయడానికి ప్రభుత్వం వేస్తున్న ఎన్నికల ఎత్తుగడ అని మరికొందరు భావిస్తున్నారు.

మళ్లీ 'స్థానిక' హడావుడి

జనవరి 14న పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు కసరత్తు కొనసాగుతున్నదని పలు మీడియా సంస్థల్లో గురువారం వార్తలు వెలువడ్డాయి. ఫిబ్రవరి నుంచి 3 విడతల్లో పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్టు కథనాల్లో పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ముగ్గురు పిల్లల నిబంధనను కూడా ఎత్తివేయనున్నారని, రిజర్వేషన్లలో మార్పులు చేర్పులపై కసరత్తు చేస్తున్నారని తెలిపారు. పంచాయతీ ఎన్నికల తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహిస్తారని వార్తల్లో చెప్పారు. అయితే ఈ వివరాలన్నీ కూడా ప్రభుత్వ లీకులే అని కొందరు కొట్టిపారేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు కూడా స్థానిక సంస్థల ఎన్నికలపై ముఖ్యమంత్రి, మంత్రులు ప్రకటనలు చేశారు. కసరత్తు మొదలైందని రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా తెలిపింది. కానీ ప్రక్రియ ప్రకటనలకే పరిమితమైందని గుర్తుచేస్తున్నారు.

విజయోత్సవాల కోసమే లీకులు?

స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇందుకు ఇంటింటి సర్వే పేరుతో రంగంలోకి దిగింది. కానీ డెడికేటెడ్ కమిషన్ ద్వారానే సర్వే చేపట్టాలని హైకోర్టు తేల్చిచెప్పడంతో ఈనెల 4న మిషన్‌ను నియమించింది. కమిషన్ గడువు డిసెంబర్ 4తో ముగియనుంది. డిసెంబర్ 10 వరకు నివేదిక అందించాల్సి ఉంది. కానీ రిజర్వేషన్లపై అధ్యయనం, నివేదిక సమర్పణకు మరింత సమయం అవసరమని కమిషన్‌వర్గాలు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నాయి. ఇప్పటికీ ఇంటింటి సర్వే పూర్తి కాలేదు. డెడికేటెడ్ సర్వే నివేదిక ఆధారంగా బీసీ రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం చట్టం చేయాల్సి ఉంటుంది. ఇదంతా ఇప్పట్లో పూర్తయ్యే అవకాశంలేదని విశ్లేషకులు చెబుతున్నారు. మరి జనవరిలో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ అంటే బీసీ రిజర్వేషన్లు లేకుండా నిర్వహిస్తారేమో అని కూడా ప్రచారం జరుగుతున్నది.

ఎమ్మెల్యే బర్త్‌డే వేడుకల్లో అధికారులు

- **కాంగ్రెస్ నేతలతో కలిసి కేక్ కటింగ్**
- **దుప్పట్ల పంపిణీలో తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో**

పరిగి, నవంబర్ 28 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొందరు అధికారుల తీరు తీవ్ర విమర్శలకు దారితీస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా వికారాబాద్‌లో ఇది మరింత శ్రుతి మించుతున్నది. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా గురువారం పరిగిలోని ఎస్సీ, బీసీ బాలికలు, బాలుర వసతి గృహాల్లో కాంగ్రెస్ నాయకులు విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయగా వారితో కలిసి పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావు, ఎంపీడీవో కరీం, ఎంఈవో గోపాల్, దోమ మండలంలోని మైలారంలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు పాల్గొనడం తీవ్ర విమర్శలకు దారితీసింది. కాంగ్రెస్ నాయకులు నిర్వహించిన ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకల్లో కేక్ కట్ చేసి, దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో వీరు పాల్గొనడం ఏమిటని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి బర్త్‌డే సందర్భంగా కాంగ్రెస్ నాయకులతో కలిసి బాలుర హాస్టల్‌లో కేక్ కట్ చేస్తున్న పరిగి తహసీల్దార్ ఆనందరావు, ఎంఈవో గోపాల్, ఎంపీడీవో కరీం తదితరులు

సమగ్ర కుటుంబ సర్వేలో సీఎం

వివరాలు నమోదు చేసిన ఎన్యూమరేటర్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ వివరాలను ఎన్యూమరేటర్లు గురువారం నమోదు చేసుకున్నారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వెళ్లి ఎన్యూమరేటర్లతో సర్వే వివరాల నమోదు ప్రక్రియను పూర్తిచేశారు. ఈ సందర్భంగా సీఎం సర్వే పురోగతిని అడిగి తెలుసుకున్నారు. వీవీఐపీలు, ఐఏఎస్, ఐపీఎస్, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగులు కచ్చితంగా సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

9 రోజులపాటు విజయోత్సవాలు

- **షెడ్యూల్ ప్రకటించిన ప్రభుత్వం**

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ) : ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా డిసెంబర్ 1 నుంచి 9 వరకు రాష్ట్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు గురువారం షెడ్యూల్ విడుదల చేసింది.

1వ తేదీన: ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ 2వ దశకు శంకుస్థాపన, విద్యార్థులకు వ్యాసరచన, సీఎం కప్ పోటీలు.

2న: 16 నర్సింగ్, 28 పారా మెడికల్ కాలేజీలు, 213 కొత్త అంబులెన్సులు, 33 ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌ల ప్రారంభం.

3న: హైదరాబాద్ రైజింగ్ కార్యక్రమాలు, ఆరాంఘర్-జూపార్క్ ఫ్లైఓవర్ ప్రారంభం, కేబీఆర్ పార్క్ వద్ద జంక్షన్ల పనులకు శ్రీకారం.

4న: ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ భవన శంకుస్థాపన, వృక్ష పరిచయ కేంద్రం ప్రారంభం, 9,007 మంది నియామకం

5న: ఇందిరా మహిళాశక్తి బజార్ ప్రారంభం, స్వయం సహాయక గ్రూపుల్లో చర్చలు, మేడ్చల్, మల్లేపల్లి, నల్లగొండలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ప్రారంభం.

6న: యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో విద్యుదుత్పత్తి ప్రారంభం.

7న: డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ప్రారంభం.

8న: 7 ఏఐ ప్రాజెక్టులు, 130 కొత్త మీసేవల ప్రారంభం, ఏఐ సిటీకి భూమి పూజ, స్పోర్ట్స్ యూనివర్సిటీకి శంకుస్థాపన.

9న: తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, ట్యాంక్‌బండ్‌పై ముగింపు వేడుకలు, డ్రోన్‌షో, ఆర్ట్ గ్యాలరీ, వివిధ స్టాళ్ల ఏర్పాటు.